సాక్షి
కాకినాడ

గురువారం | 11 | జనవరి | 2024



మహిళా శక్తికి ప్రభుత్వం చేయూత

మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించారు. వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.

8లో



సబ్‌జైలు ఘటనలో ఏడేళ్ల జైలు

యానాం సబ్‌జైలులో చొరబడి పుదుచ్చేరికి చెందిన ఒక విచారణ ఖైదీని హతమార్చేందుకు ప్రయత్నించి, దొరికిపోయిన వారికి ఏడేళ్ల శిక్ష విధిస్తూ పుదుచ్చేరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది.

11,000 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 11,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,350, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 9.60 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

సత్యదేవుని దర్శించిన జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్



జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ దంపతులకు ఆలయం వద్ద స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం: రాష్ట్ర జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేసి సత్యదేవుని ప్రసాదాలను బహూకరించారు.

1.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

కాకినాడ సిటీ: రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు అన్ని రకాల చర్యలు తీసుకుందని, ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ డి.పుష్పమణి బుధవారం తెలిపారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా అధికార యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తోందన్నారు. బుధవారం నాటికి జిల్లాలో 27,239 మంది రైతుల నుంచి 1,46,049.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం విలువ మొత్తం రూ.318.81 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.271.06 కోట్లు నగదును రైతులకు అందించినట్లు డీఎం పుష్పమణి వివరించారు. 47.75 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

5 శిబిరాలు.. 94 యూనిట్లు



ఆదిత్య కళాశాలలో శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్

కాకినాడ క్రైం: ఈ నెల 19న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో జరగనున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి సంఘీభావంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఈ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ తెలిపారు. కాకినాడ గవర్నమెంట్ ఐటీఐ, తుని ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు, ఆదిత్య డిగ్రీ కాలేజీ కాకినాడ, రోటరీ బ్లడ్ బ్యాంక్ కాకినాడ, అభయ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఐదు శిబిరాల్లో మొత్తం 94 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. ఆదిత్య డిగ్రీ కాలేజీలో ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో, లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ ప్రారంభించారు.

వ్యాపారానికి చేదోడు.. జగనన్న తోడు

- వీధి వ్యాపారులకు రూ.10 వేల వడ్డీ లేని రుణాలు
- జిల్లాలో 16,901 మందికి రూ.17.88 కోట్ల మేర లబ్ధి
- నేడు 8వ విడత జగనన్న తోడు రుణం, వడ్డీ రాయితీ అందజేతకు ఏర్పాట్లు
- జిల్లాలో 26,736 మందికి రూ.67.28 లక్షల రాయితీ





చిరు వ్యాపారులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ఒకవైపు సంక్షేమాన్ని అందిస్తూనే మరోవైపు ఆర్థికంగా కుంగిపోయిన చిన్నపాటి దుకాణదారులను ఆదుకోవాలని సంకల్పించి జగన్నన్న తోడు పథకాన్ని అమలు చేసింది. దీనిలో భాగంగా ఒక్కొక్క చిరు వ్యాపారికి పెట్టుబడి సాయం కింద రూ.10 వేల వడ్డీ లేని రుణం బ్యాంకు ద్వారా అందిస్తుంది. రుణం తీసుకొని సక్రమంగా చెల్లించిన వ్యాపారులకు వారు తీసుకున్న రుణానికి సంబంధించి బ్యాంకులకు చెల్లించిన వడ్డీని తిరిగి ఇచ్చేందుకు గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించిన వెంటనే జిల్లాలోని లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా రుణాలు, వడ్డీ రాయితీ సొమ్ము జమ చేయనున్నారు.

ఎందరికో మేలు

కరోనా వైరస్ కారణంగా అన్ని రంగాలు కుదేలై, వ్యాపారాలు పూర్తిగా దెబ్బతినడంతో వీధి వ్యాపారుల జీవితాలు తలకిందులయ్యాయి. వ్యాపారం చేసుకుంటేనే పూటగడవని పరిస్థితుల్లో వీధి వ్యాపారులు పెట్టుబడి సాయం కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి వడ్డీలకు డబ్బులు తీసుకురావాల్సి వచ్చేది. దీంతో తలకుమించిన భారంగా వ్యాపారాలు సాగేవి. వ్యాపారుల బాధలను గుర్తించిన ప్రభుత్వం వీధి వ్యాపారులకు పెట్టుబడి సాయం కింద వడ్డీలేని రుణాలు అందించేందుకు జగనన్న తోడు పథకాన్ని ప్రారంభించింది. మున్సిపాలిటీల్లో మెప్మా, గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోను బ్యాంకర్లు, వీధి వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి అప్పట్లో లబ్ధిదారులను ఎంపిక చేసి వీధి వ్యాపారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. లబ్ధిదారులను ఎంపిక చేసిందే తడవుగా వీరికి రుణాలు ఇచ్చి వ్యాపారాలు అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా బలోపేతం అయ్యేలా కృషి జరిగింది. ఏటా రెండు దఫాలుగా జగనన్న తోడు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది.

గరిష్టంగా రూ.13 వేల రుణం

2021 డిసెంబర్‌లో ప్రారంభమైన జగనన్న తోడు పథకం ఈ నెల 11వ తేదీన 8వ విడతగా జిల్లాలో 16,901 మంది లబ్ధిదారులకు (చిరు వ్యాపారులకు) రూ.17,88,30,000 సాయం అందించేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. రుణాలు తీసుకుని సక్రమంగా తిరిగి చెల్లించిన 26,736 మందికి రూ.67, 28, 512 వడ్డీ రాయితీగా అందజేస్తున్నారు. జిల్లాలో మొత్తం ఎనిమిది విడతలుగా మొత్తం 1,33,620 మంది లబ్ధిదారులకు రూ.136,28,40,000 మేర చిరు వ్యాపారులు లబ్ధి పొందారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించిన వెంటనే నేరుగా లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో రుణం కింద రూ.10 వేలు, వడ్డీ రాయితీ సొమ్ము చెల్లిస్తారు. ఏటా రుణం తీసుకొని సక్రమంగా చెల్లించిన వారికి ఏడాదికి రూ.1,000 చొప్పున పెంచి రుణం ఇస్తారు. కనిష్టంగా రూ.10వేలు, గరిష్టంగా రూ.13 వేలు రుణం చిరు వ్యాపారులు పొందుతున్నారు.

రుణాలు పొందినవారు వీరే

జగనన్న తోడు పథకానికి చిరు వ్యాపారులు అర్హులు. ఫుట్‌పాత్‌లపై పండ్లు, కూరగాయలు, అల్పాహారం, ఆహార పదార్థాలు విక్రయించేవారు, తోపుడుబండ్లు, ఆటోలు, చక్రాల బండ్లు, సైకిళ్లతో పాటు తలపై బుట్టలు పెట్టుకుని వ్యాపారం చేసేవారు, వాహనాలపై వ్యాపారాలు చేసే వారికి రుణాలు అందించారు. వీరందరూ రుణాలు పొంది సక్రమంగా బ్యాంకులకు చెల్లించడంతో వాటిపై వచ్చే వడ్డీని తిరిగి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

అర్హులైన వారందరికీ..



జగనన్న తోడు పథకం ద్వారా మున్సిపాలిటీల్లోను, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీధి వ్యాపారులకు పెట్టుబడి సాయం కింద వడ్డీ లేని రుణాలు అందిస్తున్నాం. జిల్లాలో 16,901 మందికి రూ.17.88 కోట్ల రుణం అందజేస్తున్నాం. అదేవిధంగా వడ్డీ రాయితీ కింద 26,736 మందికి రూ.67,28,512 ఇస్తున్నాం.

– కె.శ్రీరమణి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, కాకినాడ జిల్లా

ఆర్థికంగా భరోసా



జగనన్న తోడు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మాలాంటి చిరు వ్యాపారులకు ఎంతో భరోసా కల్పిస్తోంది. ఈ పథకం ద్వారా లభిస్తున్న రూ.10 వేల వడ్డీ లేని రుణాన్ని మా మట్టి బొమ్మల వ్యాపార అభివృద్ధికి ఉపయోగించుకుంటున్నాను. గతంలో పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ బాధ తప్పింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల పాలిట వరంగా మారాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మేమంతా రుణపడి ఉంటాం.

– డి.సత్యవతి, కాకినాడ

వ్యాపార అభివృద్ధికి వీలు



జగనన్న తోడు పథకం చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ జీవిస్తున్న వారికి ఎంతో తోడుగా ఉంటోంది. కోవిడ్ సమయంలో ఈ పథకం మాకెంతగానో ఉపయోగపడింది. కిరాణా దుకాణం నిర్వహిస్తూ నా కాళ్లపై నేను నిలబడగలుగుతున్నాను. మా మహిళలంతా సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

– ఎం.కుమారి, వీకే రాయపురం, సామర్లకోట మండలం

రత్నగిరిపై నిర్మాణాల పరిశీలన



వనదుర్గ ఆలయానికి నిర్మించిన రోడ్డును పరిశీలిస్తున్న దేవదాయశాఖ సాంకేతిక సలహాదారు కొండలరావు, సీఈ శ్రీనివాసరావు, ఈవో రామచంద్రమోహన్ తదితరులు

అన్నవరం: రత్నగిరిపై వివిధ నిర్మాణాలను దేవాదాయ, ధర్మాదాయశాఖ సాంకేతిక సలహాదారు కొండలరావు, చీఫ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం, రత్నగిరిపై రెండో ఘాట్‌రోడ్‌ను కలుపుతూ పాత సీఆర్వో కార్యాలయం వెనుక నుంచి నిర్మించిన ఆదిశంకరమార్గ్, మొదటి ఘాట్ రోడ్ నుంచి వనదుర్గ ఆలయానికి నిర్మిస్తున్న లింక్ రోడ్డు, మల్టీలెవిల్ పార్కింగ్ పనులను పరిశీలించారు. ఆదిశంకరమార్గ్, లింక్‌రోడ్లు జారిపోకుండా రివిట్‌మెంట్ వేయాలని సాంకేతిక సలహాదారు కొండలరావు సూచించారు. నమూనా ఆలయం వద్ద ఏడు షాపులకు బదులు మొదట రెండు షాపులు నిర్మించాలని, అదే విధంగా షాపులపై రేకుల షెడ్డు బదులు పర్మినెంట్‌గా శ్లాబ్ వేసే ప్రతిపాదనలపై కూడా చర్చించారు. అదే విధంగా ఇతర నిర్మాణాలపై కూడా అధికారులకు తగు సూచనలిచ్చారు. ఈ నిర్మాణాలపై దేవదాయశాఖ ఉన్నతాధికారులతో చర్చలు జరిపేందుకుగాను దేవస్థానం ఈఈ నర్సింహరెడ్డి, డీఈ రాంబాబును గురువారం విజయవాడ కమిషనర్ కార్యాలయానికి రావాలని ఆదేశించారు. ఈ పనులపై లిఖిత పూర్వక ఆదేశాలు ఇచ్చేందుకు తమను రమ్మని ఆదేశించారని ఈఈ నర్సింహరెడ్డి తెలిపారు. అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్, ఎస్ఈ జీ శేఖర్, డీఈ గుర్రాజు, ఎలక్ట్రికల్ డీఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు



జెడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ పొందుతున్న అధికారులు, సిబ్బంది

కాకినాడ సిటీ: పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపుదిద్దుకోనున్నాయి. ఈ మేరకు జిల్లా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. జిల్లాలో ఈ నెల 17 నుంచి 24 వరకు గ్రామ పంచాయతీల స్థాయిలో ముసాయిదా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (డ్రాఫ్ట్ జీపీడీపీ) తయారు చేసే ప్రక్రియను చేపట్టాలని మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఇందుకోసం సంబంధిత శాఖాధికారులకు రెండు రోజుల పాటు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా పరిషత్ సీఈవో ఎ.రమణారెడ్డి, సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో రెండు రోజుల ప్రత్యేక సమావేశాలు పూర్తి చేశారు.

షెడ్యూల్ ఇలా..

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ కోసం ఈ నెల 9, 10 తేదీల్లో ఎంపీడీవో, ఈఓపీఆర్డీలు అనుబంధ శాఖల అధికారులకు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో శిక్షణను పూర్తి చేశారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు పంచాయతీ కార్యదర్శులకు, ఫ్రంట్‌లైన్ వర్కర్స్, సర్పంచ్‌లు, ఫంక్షనల్ కమిటీలకు, మండల స్థాయిలో రెండేసి రోజులు పాటు శిక్షణ నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేస్తారు. 25 నుంచి 27లోగా జీపీడీపీ (2024–25) ఆమోదానికి పంచాయతీల్లో రెండో గ్రామసభ నిర్వహణ, 27 నుంచి 28వ తేదీ వరకు మండల అధికారులతో స్క్రూటినీ, 28, 29 తేదీల్లో గ్రామ పంచాయతీ తీర్మానం ఆమోదం, ఇలా ఆమోదించిన ప్రణాళికలు (జీపీడీపీ) ఇ–గ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో ఈ నెల 31లోగా అప్‌లోడ్ చేస్తారు. ఫిబ్రవరినెలాఖరులోగా మండల స్థాయిలో బ్లాక్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను, మార్చి 31వ తేదీలోగా జిల్లా పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఇ–గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించేలా షెడ్యూల్‌ను తయారు చేశారు.

సబ్ ప్లాన్ గ్రామాలను ఐటీడీఏలో కలపండి

ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్‌కు వినతి



వంతాడలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

ప్రత్తిపాడు రూరల్: గిరిజన సబ్ ప్లాన్ పరిధిలోని గ్రామాలను రంపచోడవరం ఐటీడీఏలో కలపాలని స్థానిక గిరిజన ప్రజలు ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్‌ను కోరారు. గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి విజయశాంతి, స్థానిక మండల అధికారులతో కలిసి బుధవారం ఆయన మండలంలోని వంతాడ, పాండవులపాలెం, పాదురుపాక గిరిజన గ్రామాల్లో రెండవ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. వంతాడ పరిసర ప్రాంతాల్లో దశాబ్దాల కాలంగా భారీ ఎత్తున మైనింగ్ జరుగుతోందని, తమ గ్రామం మాత్రం అభివృద్ధికి నోచుకోవడంలేదని, ఇప్పటికైనా మైనింగ్ సొమ్ములో కొంత స్థానిక అవసరాలకు వెచ్చించాలని స్థానికులు కోరారు. కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని, ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కాని 250 ఎకరాల కొండ పోడు భూమి సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలని. గ్రామంలోనే రేషన్ బియ్యాన్ని అందజేయాలని, 108 వాహనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాండవులపాలెం గురుకుల పాఠశాలకు ఐదు ఎకరాల స్థలాన్ని దానం చేసిన ఇరటా వీరన్న భార్య తనకు చిరుద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కమిషన్ సభ్యుడిని కోరింది. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజన ప్రజల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. తద్వారా రాష్ట్రంలోని 32 లక్షల మంది గిరిజనులకు లబ్ధి చేకూరిందన్నారు. గిరిజన ప్రజల సమస్యలు పరిష్కరించి వారికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఎస్టీ కమిషన్ పని చేస్తుందన్నారు. తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎంఈఓ వి.రాజబాబు, ఏపీఎం వెంకట్, హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శ్రీరాం, ఏపీఓ కుమారస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి శ్రీవల్లీ, ఎస్సై పవన్‌కుమార్, గ్రామ కార్యదర్శి వీరబాబు పాల్గొన్నారు.

ఊరూరా.. నోరూరేలా..

- సంక్రాంతికి ప్రత్యేక పిండి వంటలు
- తయారీలో మహిళలు నిమగ్నం
- షాపులలోనూ విక్రయాలు
- ఉమ్మడి జిల్లాలో పండగ సందడి



సంప్రదాయ పిండి వంటలు

సాక్షి అమలాపురం: ఆత్రేయపురం పూతరేకులు.. అవిడి పాలకోవ.. తాపేశ్వరం కాజా.. పెరుమళ్లపురం పాకం గారెలు.. కాకినాడ గొట్టం కాజా... అల్లవరం చెకోడీలు ఇలా చెప్పుకుంటూ పోతే ఉమ్మడి జిల్లాలో పిండి వంటలకు, స్వీట్ షాపులకు జాతీయ స్థాయిలో పేరుంది. అతిథి మర్యాదలకు చిరునామాగా నిలిచే తూర్పున సంక్రాంతి వచ్చిందంటే చాలు ఈ ప్రత్యేక స్వీట్, హాట్‌లకు అదనంగా సంప్రదాయ పిండి వంటలు తోడవుతాయి. కరకరలాడే జంతికలు, నోటిలో కరిగిపోయే వెన్నప్పాలు, నమిలే కొద్దీ మాధుర్యాన్నిచ్చే పొంగడాలు, పంటికి పని చెప్పే చక్కిడాలు, నోటిని తీపిచేసే కజ్జికాయలు, నేతి సువాసనలతో నోరూరించే సున్నుండలు, కమ్మనైన అరిసెలు తదితర సంప్రదాయ వంటలతో ఉమ్మడి జిల్లా ఘుమఘుమలాడాల్సిందే.

పిండి వంటలకు ప్రత్యేకత

సంక్రాంతి పండగ అంటేనే ఎన్నో సందడులు. వాటిలో పిండి వంటలు ప్రత్యేకం. విద్య, ఉద్యోగం, వ్యాపారాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన సొంతవారు.. కొత్త అల్లుళ్లు.. వారితో పాటు అతిథులు వచ్చే సమయం ఆసన్నం కావడంతో ఉమ్మడి జిల్లాలో ఎటు చూసినా సందడే సందడే. ప్రతి ఇంటి వద్ద సంప్రదాయ పిండి వంటల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. పేద, ధనిక తారతమ్యం లేకుండా ప్రతి ఇంట పిండివంటల తయారీ మొదలైంది. అరిసెలు, మినప సున్నుండలు, గోధుమ సున్నుండలు, బెల్లం మిఠాయి, పానీలు, గోరుమిఠాయి, జంతికలు, చల్ల గుత్తులు, పోకుండలు, రవ్వ లడ్డూలు, మైసూర్ పాకం, కార బూందీ, మురుకులు, అప్పడాలు, తదితర పిండి వంటలు అన్నిచోట్ల చేయడం కనిపిస్తోంది. వీటితో పాటు కోనసీమ ప్రాంతంలో పానీలు, ఇలంబికాయలు, కొబ్బరి నౌజు, కొబ్బరి గారెలు, ఉండలు, మెట్ట ప్రాంతంలో వెన్నప్పాలు, గోరుమిటీలు ఎక్కువగా చేస్తుంటారు. ఎక్కువ పిండి వంటలు చేసి పండగ కోసం దూరప్రాంతాల నుంచి వచ్చిన తమ కుటుంబ సభ్యులు తిరిగి వెళ్లే సమయంలో వాటి నందిస్తుంటారు. ఇరుగు పొరుగు వారు పిండివంటలు ఇచ్చిపుచ్చుకుంటూ ఆప్యాయతలను పంచుకుంటారు.

స్వీట్స్ షాపుల్లోనూ..

పిండి వంటలు తయారు చేసుకునే తీరిక లేక వాటి కోసం స్వీట్ షాపులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఏడాది పొడవునా బెంగాళీ, కలకండ, కోవా, కాజూ పేస్ట్ స్వీట్స్, ఆగ్రా మిక్చర్ తదితర హాట్ రకాలను తయారు చేసే స్వీట్‌షాపుల నిర్వాహకులు పెద్ద పండగ కోసం సంప్రదాయ పిండివంటలను సిద్ధం చేస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, మండపేట, తాపేశ్వరం, కొత్తపేట, తుని వంటి ప్రాంతాల్లో స్వీట్ల తయారీలో పేరొందిన పెద్ద సంస్థలతో పాటు చిన్న దుకాణాల్లో వీటి తయారీ ఎక్కువగా కనిపిస్తోంది. ఆయా తయారీ సంస్థల వద్ద సంక్రాంతి సమయంలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి మరీ విక్రయాలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో సంక్రాంతి పిండి వంటలు విక్రయాలు ఆన్‌లైన్‌లోనూ జోరుగా సాగుతున్నాయి.



మినప సున్నుండలు



అరిసెలు



పోకుండలు

అందుబాటులోకి అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు



డాక్టర్ వైఎస్సార్ సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ గీత, ఎమ్మెల్సీ పద్మశ్రీ

- వాకలపూడిలో రూ.90 లక్షలతో భవన సముదాయం నిర్మాణం
- ప్రారంభించిన ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలను నిజం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సేవలందించేందుకు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ అందుబాటులోకి వచ్చాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని వాకలపూడి గ్రామ పరిధిలో బీచ్‌ను ఆనుకుని నూతనంగా రూ.90లక్షలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను బుధవారం ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ తాను వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయి డాక్టర్ వైఎస్సార్ సమగ్ర వ్యవసాయ ప్రయోగశాలకు శంకుస్థాపన చేశానన్నారు. అన్ని అధునాతన సదుపాయాలతో భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. మరో రూ.కోటి నిధులతో ల్యాబ్ సామగ్రి, ఫర్నిచర్ సమకూర్చుతామన్నారు. అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతపై పరీక్షలు జరుగుతాయన్నారు. పశు సంవర్థక శాఖకు సంబంధించి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, ఆక్వా రైతులకు సంబంధించి మట్టి, నీరు, మైక్రో బయోలజీ, వ్యాధుల నిర్ధారణ పరీక్షలు జరుపుతామన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 70 అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌కు శంకుస్థాపనలు చేశామన్నారు. వాకలపూడిలో అత్యంత ఖరీదైన స్థలాన్ని కేటాయించామన్నారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖ మంత్రిగా పనిచేసిన కన్నబాబు హయాంలో సీఎం ఆలోచనలకు అనుగుణంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లకు శ్రీకారం చుట్టారని, నేడు అందుబాటులోకి రావడంతో రైతాంగానికి ఎంతగానో మేలు చేస్తాయన్నారు. మత్స్యకారులు, పాడి రైతులకు మేలు చేసేలా అగ్రి టెస్టింగ్ ల్యాబ్ దోహదపడుతుందన్నారు. సీఎం జగన్ రైతులకు అండగా ఉండి రైతు భరోసాతో పాటు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నారన్నారు. వ్యవసాయశాఖ జేడీ విజయకుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ సూర్య ప్రకాశరావు, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, గోపుశెట్టి బాబ్జీ, జాషువ గిరి, ఏడీఏ పద్మశ్రీ, ఏడీ సురేష్, మత్స్యశాఖ ఏడీ కరుణాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 15, 16వ తేదీల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటించారు. నాందేడ్ – కాకినాడ టౌన్ (07487/88) మధ్య తిరిగే ఈ రైళ్లు రాజమహేంద్రవరం, సామర్లకోట స్టేషన్లలో ఆగుతాయన్నారు. వీటిని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

దూరవిద్యలో ప్రవేశాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023 – 24 సంవత్సరానికి దూరవిద్యలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్ కోర్సుల్లో మొదటి, రెండు, మూడో సంవత్సర ప్రవేశాలు పొందేందుకు గడువు ఈనెల 31తో ముగుస్తుందన్నారు. సంబంధిత విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వాటిని స్టడీ సెంటర్‌లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 29614 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

154 కోడి కత్తుల స్వాధీనం



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ గోవిందరాజు

రాజోలు: సర్కిల్ పరిధిలో 154 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపారు. ఆయన బుధవారం రాజోలు సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాలపై కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు ఎస్సైలు ఎస్.రాము, బి.సంపత్, జి.పృథ్వీలకు వచ్చిన సమాచారం ఆధారంగా ఈ చర్యలు చేపట్టామన్నారు. సంక్రాంతి పండగ పేరుతో అనధికారికంగా జూదాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మహిళా శక్తికి ప్రభుత్వం చేయూత

- ఆర్థికంగా అండదండలు
- వ్యాపారానికి ప్రోత్సాహం
- ఆకట్టుకుంటున్న మెప్మా అర్బన్ బజారు



పుష్కరఘాట్‌లో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ బజార్



వివిధ వస్తువులను విక్రయిస్తున్న మహిళ

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. కుటుంబాలు, తద్వారా సమాజం బాగుపడాలంటే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ఆయన లక్ష్యం. ఆ మేరకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నారు. మహిళలు వ్యాపారాల్లో రాణించేందుకు చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో ఆర్థిక భరోసా కల్పించారు. సొంతంగా వస్తువులు తయారు చేసి, మార్కెట్‌లో అమ్మకం సాగించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి నెలా రెండో గురు, శుక్రవారాల్లో రాజమహేంద్రవరంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులను స్థానిక పుష్కర ఘాట్‌లో మెప్మా బజార్ పేరుతో విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రజల ఆదరణ

2023 ఏప్రిల్‌లో మొదలైన మెప్మా అర్బన్ బజార్ ప్రజల ఆదరణ పొందింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధి దిశగా దూసుకుపోతున్నారు. పురుషులతో సమానంగా రాణిస్తూ కుటుంబానికి కొండంత అండగా నిలుస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అంతంత మాత్రంగా అవకాశాలు కల్పించడంతో స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయలేకపోయారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ స్వయం శక్తితో ఎదిగేందుకు బాటలు వేశారు. దీంతో డ్వాక్రా పొదుపు సంఘాలు చిరు వ్యాపారాలు ప్రారంభించి తోటి వారికీ ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాయి. అక్కడ మహిళలు తాము తయారు చేసిన ఉత్పత్తులను అందుబాటు ధరలకే నగర ప్రజలకు విక్రయిస్తున్నారు.

వివిధ ఉత్పత్తుల విక్రయం

రాజమహేంద్రవరం నగరంలోని 6,345 స్వయం సహాయక సంఘాల్లో 63,514 మంది సభ్యులు ఉన్నారు. రుణాలు పొందిన ఈ మహిళలందరూ ఇంటి వద్దే వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వివిధ రకాల దుస్తులు, స్త్రీల అలంకరణ వస్తువులు, జ్యూట్ బ్యాగులు, కొయ్య బొమ్మలు, వైర్ బ్యాగులు, హోమ్ మేడ్ ఫుడ్ ప్రోడక్టులు, వెజ్, నాన్ వెజ్ పచ్చళ్లు తదితర వాటిని తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటిని మార్కెట్లో ప్రోత్సహించేందుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ బజార్‌లో వ్యాపారాలు సాగించేందుకు 32 రకాల షాపులు ఏర్పాటు చేసేందుకు మహిళలు ఉన్నారు.

జగనన్న ప్రోత్సాహం



జగనన్న అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. ఇంటి వద్ద తయారు చేసిన వస్తువులను విక్రయించేందుకు బజారు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థికంగా నిలబడేందుకు అవకాశం ఏర్పడింది. బజారు ఏర్పాటు చేసిన దగ్గర నుంచీ ప్రజలు ఆదరిస్తున్నారు. నాణ్యతతో కూడిన నైటీలు, పంజాబీ డ్రెస్‌లు, మహిళలకు కావాల్సిన అన్ని రకాల వస్త్రాలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– అరుణ

కష్టానికి ప్రతిఫలం



మేము పడుతున్న కష్టానికి ప్రతిఫలం దక్కుతోంది. కుట్టు పని ద్వారా తయారు చేసిన వస్తువులకు బజారులో మంచి గిరాకీ లభిస్తోంది. తక్కువ ధరకు మహిళలకు జాకెట్లు, జిగ్‌జాగ్ మొదలగు వాటిని సిద్ధం చేసి అందజేస్తున్నాం. ప్రభుత్వం సహకారం మరువలేనిది. తయారు చేసిన వస్తువులకు ప్రజల ఆదరణ లభిస్తోంది.

– సంధ్యారాణి

ఇద్దరు గంజాయి స్మగ్లర్ల అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మణరావు

జగ్గంపేట: కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన గంజాయి రవాణా కేసులో నిందితులైన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.లక్ష్మణరావు ఈ వివరాలు వెల్లడించారు. 2021 డిసెంబర్‌లో విశాఖపట్నం ఏజెన్సీలోని ధారకొండ గ్రామం నుంచి మహారాష్ట్రకు 750 కేజీల గంజాయిని 152 ప్యాకెట్లలో నింపి, కారులో తరలిస్తున్నారు. ఆ వాహనాన్ని కత్తిపూడి వద్ద పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పలు మార్గాల్లో తిప్పి, చివరకు కిర్లంపూడి మండలం తామరాడ వద్ద ఏటిగట్టున గంజాయి ప్యాకెట్లుతో వదిలేశారు. పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో స్కూటీపై వెళుతున్న ఒక వ్యక్తిని కారుతో ఢీకొనగా, అతడు మృతి చెందాడు. అప్పటి నుంచి నిందితులు తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద నిర్వహించిన తనిఖీలలో ఈ కేసులో ప్రధాన నిందితులైన హనుమాన్ మోహిత్ (27), సమీర్ సుధాకర్ గవాంది (29)ను గుర్తించి కిర్లంపూడి పోలీసులు అరెస్టు చేశారు. ఇదే ముఠాకు చెందిన అతుల్ ఓంకార్, సంజయ్ పాండురంగ, ఉమేష్ టాకిరే కోసం గాలిస్తున్నారు. ప్రధాన నిందితులపై మోతుగూడెం పీఎస్ పరిధిలోనూ, ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాలోనూ, ఛత్తీస్‌గఢ్‌లోని కుంట పీఎస్ పరిధిలోనూ హత్య, హత్యాయత్నం కేసులు ఉన్నాయి.

యానాం సబ్‌జైలు ఘటనలో ఏడేళ్ల జైలు



యానాంలోని సబ్ జైలు

యానాం: యానాం సబ్‌జైలులో చొరబడి పుదుచ్చేరికి చెందిన ఒక విచారణ ఖైదీని హతమార్చేందుకు ప్రయత్నించి, దొరికిపోయిన 13 మందికి ఏడేళ్ల శిక్ష విధిస్తూ బుధవారం పుదుచ్చేరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. యానాం సబ్‌జైలులోకి 2013 ఆగస్టు 2013వ తేదీ అర్ధరాత్రి పుదుచ్చేరి నుంచి వచ్చిన కొందరు రౌడీషీటర్లు గోడ దూకి చొరబడ్డారు. అక్కడే కాపలా ఉన్న సెంట్రీని బంధించి నోటికి ప్లాస్టర్ వేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న మరో సెంట్రీ ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పారిపోతున్న 13 మంది నిందితులను తాళ్లరేవు మండల పరిధిలోని ఉప్పంగల, లచ్చిపాలెం తదితర ప్రాంతాల్లో అరెస్టు చేశారు. దీనిపై అప్పటి ఎస్సై కె. షణ్ముగం కేసు నమోదుచేసి చార్జిషీటు దాఖలు చేశారు. అప్పటి నుంచీ దాదాపు 11 ఏళ్ల పాటు ఈ కేసు విచారణ సాగింది. దీనికి సంబంధించి 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తెలుగువాడు, మిగిలిన వారందరూ పుదుచ్చేరికి చెందినవారు. ఈ మేరకు బుధవారం పుదుచ్చేరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి కె.మోహన్ నిందితులకు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రాజు వాదనలు వినిపించారు. 13 మంది నిందితుల్లో విజయ కుమార్, సిలమ్‌బర్సన్ విచారణ సమయంలోనే మృతి చెందారు. అలాగే విళ్ల శంకర కరుణ, పళ్ల సురేష్ నిర్దోషులుగా విడుదల చేశారు. ఒకడు పరారీలో ఉన్నాడు.

రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనుల పరిశీలన



రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రైల్వే సాధన సమితి సభ్యులు

మామిడికుదురు: వైనతేయ, వశిష్ట నదులపై నిర్మాణంలో ఉన్న రైల్వే బ్రిడ్జిలను కోనసీమ రైల్వే సాధన సమితి బుధవారం పరిశీలించింది. వైనతేయ వారధిపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను బృందం పరిశీలించి రైల్వే ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించింది. ఈ బ్రిడ్జికి సంబంధించి 19 పిల్లర్లకు గాను 12 పిల్లర్ల నిర్మాణం పూర్తి కాగా, ఏడు పిల్లర్లు నిర్మాణంలో ఉన్నట్టు అధికారులు తెలిపారని సాధన సమితి కన్వీనర్, డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. రెండు అబెట్‌మెంట్ పిల్లర్లకు సంబంధించిన స్థలం రాష్ట్ర ప్రభుత్వం అప్పగించాల్సి ఉందన్నారు. చించినాడ వద్ద వశిష్ట రైల్వే బ్రిడ్జికి మొత్తం 19 పిల్లర్లు, రెండు అబెట్‌మెంట్ పిల్లర్ల నిర్మాణం పూర్తి కావచ్చాయన్నారు. రెండు బ్రిడ్జిల వద్ద 160 మంది పనిచేస్తున్నారన్నారు. కోటిపల్లి వద్ద గౌతమి బ్రిడ్జికి సంబంధించి 45 పిల్లర్లపై ట్రాక్ నిర్మాణానికి ప్రసాద్ కన్‌స్ట్రక్షన్‌కు కాంట్రాక్టు మంజూరు అయ్యిందని, త్వరలోనే ట్రాక్ నిర్మాణం మొదలవుతుందన్నారు. ముక్తేశ్వరం – అమలాపురం ట్రాక్ నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలిచేందుకు సాంకేతిక అంశాలను రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారన్నారు. అమలాపురం – గుడిమెళ్లంక స్థల సేకరణ కోసం సర్వే పూర్తయ్యిందని, దీనిపై రైల్వే, రాష్ట్ర అధికారులు జాయింట్ సర్వే జరిపి అలైన్‌మెంట్‌ను నిర్ధారించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు సప్పా నాగేశ్వరరావు, బీఎస్ మూర్తి, ఉప్పుగంటి భాస్కర రావు, పోలిశెట్టి శివాజీ, ఎరగర్ల వెంకటేశ్వరరావు, దొమ్మేటి సత్యనారాయణ, జీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

14న రత్నగిరిపై సంక్రాంతి వేడుకలు

- తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు
- మహిళలకు ముగ్గుల పోటీలు



సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠ చేసే వార్షిక కల్యాణ మంటపం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో ఈనెల 14వ సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు అన్నవరం దేవస్థానం అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం ఆరు గంటలకు రామాలయం ఎదురుగా గల ప్రాంగణంలో భోగిమంటను పండితుల మంత్రోచ్ఛారణ మధ్య వెలిగిస్తారు. కార్యక్రమానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్‌ను ఆహ్వానించారు. సంక్రాంతి సంబరాలకు సత్యదేవుని ఆలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేస్తున్నారు. రామాలయం ఎదురుగా గల ప్రాంగణంలో జానపద కళారూపాల ప్రదర్శనలు జరుగుతాయి. గ్రామీణ వాతావరణాన్ని గుర్తుకు తెచ్చేలా తాటాకులతో పాక, కొబ్బరి చెట్టు, ఈత చెట్టు, తాటి చెట్టు, వరి ఆకుమడి, ఫిష్ ట్యాంక్, ధాన్యపు రాశి, నుయ్యి, రచ్చబండ, కోడిపుంజులు, ఎడ్లబండి, పొట్లేలు, ఆవు దూడ తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నారు. అలాగే గంగిరెద్దుల వాళ్లు, జంగమ దేవర, కొమ్మదాసరి తదితరులు కూడా సందడి చేయనున్నారు. వీటితో పాటు సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక మీద సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కూడా భక్తులు దర్శించేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి ఆలయానికి, రాజగోపురాలకు చేస్తున్న విద్యుత్ అలంకరణ, పుష్పాలంకరణ ఆకట్టుకోనుంది. ఆలయ ప్రాంగణంలోని సర్క్యులర్ మండపంలో భోగి పండగ రోజు ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తారు. విజేతలుగా నిలిచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తారు.

ఏడు పూరిళ్లు దగ్ధం



రంగవల్లి నగర్‌లో కాలిపోతున్న పూరిళ్లు

జగ్గంపేట: జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో బుధవారం రాత్రి ఏడు పూరిళ్లు కాలిపోయాయి. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఒక ఇంటిలో గ్యాస్ బండ పేలడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. ఆ ఇంటి నుంచి ఎగసిన మంటలు పక్కనున్న ఇళ్లకు వ్యాపించాయి. ఆయా ఇళ్లలో మరో రెండు గ్యాస్ బండలు పేలినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జగ్గంపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసింది. అగ్నిమాపక అధికారి నీలమయ్య మాట్లాడుతూ ప్రమాదం ఎలా జరిగిందో చెప్పలేమని, ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకులు వీరాంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు.

ఇజ్రాయిల్‌లో ఉపాధి అవకాశాలు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నియమకాలు నిర్వహించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి డి.హరిశేషు బుధవారం తెలిపారు. ఇజ్రాయిల్‌లో ప్లాస్టరింగ్ వర్క్, సిరామిక్ టైలింగ్, బిల్డింగ్ ఫామ్ వర్క్, రాడ్ బెండింగ్ పనిచేసేందుకు అభ్యర్థులు కావాలన్నారు. 8వ తరగతి, ఆపైన విద్యార్హత కలిగి, 21 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసున్న వారు అర్హులని, ఎంపికైన వారికి రూ. 6100 ఇజ్రాయెలీ న్యూ షెకెల్ అంటే సుమారు రూ.1,37,260 జీతం ఇస్తారన్నారు. ప్రత్యేక డిపాజిట్ ఫండ్ రూ.16,380ను ఇజ్రాయిల్‌లో లోకేషన్ బట్టి వసతి సౌకర్యాలకు జీతం నుంచి కట్ చేస్తామన్నారు. మెడికల్ బీమా కోసం 134 ఇజ్రాయెలీ న్యూ షెకెల్ జీతం నుంచి కట్ చేస్తారన్నారు. ఆయా పనుల్లో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలని, లాంగ్వేజ్ స్కిల్స్, బేసిక్ ఇంగ్లిషు తెలియాలన్నారు. ఎంపలోయర్ ద్వారా వసతి, జాయినింగ్ టికెట్ అభ్యర్థులు భరించుకోవాలన్నారు. పనిలో చేరిన కాంట్రాక్ట్ పీరియడ్ మొదటి వీసా, వర్క్ పర్మిట్ క్యాలెండర్ సంవత్సరం ముగిసే వరకు చెల్లుబాటు అవుతుందన్నారు. ఒక సంవత్సరం నుంచి గరిష్టంగా 63 నెలల వరకూ అదనంగా పొడిగించవచ్చన్నారు.

కాపు వెల్ఫేర్ డైరెక్టర్‌గా రవి



కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన లింగం రవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూకు ఆయన కొనసాగుతారని పేర్కొంది.

డెవలపర్ ప్రోగ్రామ్‌తో ఎంతో ప్రయోజనం



క్లౌడ్ కంప్యూటింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

గండేపల్లి: పరిశ్రమలకు కావాల్సిన నూతన విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు డెవలపర్ ప్రోగ్రామ్ ఎంతో దోహదపడుతుందని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ పి.కృష్ణారావు అన్నారు. సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియా స్పార్క్, ఆలీబాబా క్లౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు డెవలపర్ ప్రోగ్రామ్‌పై నాలుగు రోజుల శిక్షణ నిర్వహించారు. చివరి రోజైన బుధవారం కృష్ణారావు మాట్లాడుతూ వెయ్యి మంది ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణలో పాల్గొని సర్టిఫికెట్లు సాధించారన్నారు. ఫౌండర్, సీఈఓ, ఇండియా స్పార్క్ ఎంఎస్ రూపాతంటి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు క్లౌడ్ సర్వీసెస్‌పై నూతన అప్లికేషన్లు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, మేనేజ్‌మెంట్ ఎంవీ హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సతీష్, ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ జి.నరేష్, డీన్ ప్లేస్‌మెంట్ ఎం.రాధికామణి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి సోపానం

- కామన్‌వెల్త్ నేషనల్స్ సెక్రటరీ జనరల్ పెట్రిసియా స్కాట్లాండ్
- గైట్ కళాశాల సందర్శన



మాట్లాడుతున్న పెట్రిసియా స్కాట్లాండ్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

రాజానగరం: ఆత్మవిశ్వాసమే విజయానికి సోపానమని కామన్‌వెల్త్ నేషనల్స్ సెక్రటరీ జనరల్ పెట్రిసియా స్కాట్లాండ్ అన్నారు. సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొంటున్న గోదావరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (గైట్) కళాశాలను బుధవారం ఆమె సందర్శించారు. కొద్దిసేపు విద్యార్థులతో మమేకమయ్యారు. ఆమె మాట్లాడుతూ కామన్ వెల్త్ నేషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని (2023 – 24) కామన్ వెల్త్ యువజన సంవత్సరంగా పరిగణించిందన్నారు. యువత తలచుకుంటే సాధించలేనిది లేదన్నారు. కామన్ వెల్త్ నేషన్స్‌లో 30 ఏళ్ల లోపు యువత ఎక్కువగా ఉన్నారన్నారు. ఆలోచనా దృక్పథాన్ని మార్చుకోవాలని, నిరంతరం నూతనావిష్కరణలపైపు దృష్టి సారించాలన్నారు. నైపుణ్యం జోడిస్తే అనేక అద్భుతాలను సృష్టించగలరన్నారు. గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేయడలంలో సర్ ఆర్థర్ కాటన్ చూపిన చొరవను, శ్రద్ధను ప్రస్తావిస్తూ, ఆయన బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని సూచించారు. ఎవరికి వారే తమ రంగంలో అద్భుతాలను ఆవిష్కరించాలనే తలంపుతో పయనించాలన్నారు.

ఏటా స్కాలర్‌షిప్‌లు

చైతన్య విద్యాసంస్థల ద్వారా ప్రతి ఏటా వంద మందికి కామన్ వెల్త్ స్కాలర్ షిప్‌లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు), గైట్ కళాశాల ఎండీ కె.శశివర్మ ప్రకటించారు. దీని వల్ల కామన్ వెల్త్‌లోని 56 దేశాలకు చెందిన మెరిట్ విద్యార్థులు తమ విద్యా సంస్థలలో విద్యను అభ్యసించవచ్చన్నారు. ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ ఇన్నోవేషన్ అవార్డు 2023ను పెట్రిసియా స్కాట్లాండ్‌కు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్ ఆర్థర్ కాటన్ మేనకోడలు, కామన్ వెల్త్ సెక్రటేరియట్ చీఫ్ డెబ్రా మైఖేల్ గ్రేసీ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఎస్‌జీ అధికారులు ప్రొఫెసర్ ప్రజాపతి ద్వివేది, సుశీల్ చంద్ర రావ్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రతినిధి ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్, మేఘాలయ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి సంపత్ కుమార్, క్రిష్టి యూనివర్సిటీ (బెంగళూరు) ప్రొఫెసర్ కాజీ వర్గేష్, రొమానియా ఏఐఎక్స్‌ఫర్ట్ షాబిన్ డామా, స్మార్ట్ విలేజ్ డైరెక్టర్ వైఎస్ మైకెల్ పాల్గొన్నారు. ముందుగా స్కాట్లాండ్‌కు చైతన్య విద్యా సంస్థల చైర్మన్ చైతన్యరాజు, గైట్ కళాశాల ఎండీ శశివర్మ, జేసీ తేజ్‌భరత్, ఆర్డీఓ చైత్రవర్షిణి స్వాగతం పలికారు.